

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి
- గత ప్రభుత్వంలో పెట్టిన కేసులు తొలగించేందుకు న్యాయ నిపుణుల సలహాతో చర్యలు
- హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడి
- పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ఘన సత్కారం

5



నీటితో నిండుగా ఉన్న తాజంగి జలాశయం

'తాజంగి'కి జలకళ

నెల ముందుగానే నిండిన జలాశయం

చింతపల్లి, జూలై 7: మండలంలోని తాజంగి జలాశయానికి జలకళ వచ్చింది. ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయంలో నీరు చేరింది. సాధారణంగా జూలై నెలాఖరులో జలాశయం గట్టుపైకి నీరు చేరుకుంటుంది. అయితే ఈ ఏడాది తొలకరి వర్షాలు భారీగా కురవడంతో ఇప్పటికే భారీగా నీరు చేరింది. ప్రస్తుతం సాధారణ స్థాయికి మించి నీటి నిల్వలతో జలాశయం పర్యాటకులను ఆకట్టుకుంటుంది. జలాశయం నిండుకోవడంతో ఖరీఫ్‌కు సాగు నీరు కొదవ ఉండదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ముంచంగిపుట్టు మండలం కొండపడలో జగన్నాథస్వామి రథయాత్రలో పాల్గొన్న భక్తులు

జగన్నాథుని రథయాత్రకు పోటెత్తిన గిరిజనం

ముంచంగిపుట్టు, జూలై 7: మండలంలోని కొండపడ గ్రామంలో జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్రదేవికి పూజలు చేసిన అనంతరం ఉత్సవమూర్తులను రథంపై ఊరేగించారు. రథాన్ని లాగేందుకు భక్తులు ఎగబడ్డారు. జగన్నాథస్వామిని దర్శించుకొనేందుకు మండల నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలాగే దారెల, మాచ్‌ఖండ్, ఒనకఢిల్లీ, తదితర ప్రాంతాల్లో రథయాత్రను ఘనంగా జరుపుకున్నారు.

మెడికల్ కాలేజీకి వైసీపీ ఝలక్!

- నిధులు విడుదల చేయని పాలకులు
- సకాలంలో పూర్తి కాని నిర్మాణాలు
- తరగతుల నిర్వహణకు ఎన్ఎంసీ అనుమతి నిరాకరణ
- ఒప్పందం ప్రకారం 2023 డిసెంబరుకే భవన నిర్మాణాలు పూర్తికావాలి
- మరో రెండేళ్లకు గాని నిర్మాణం పూర్తి కాని దుస్థితి

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

వైసీపీ సర్కారు చేసిన పాపం పాడేరు ప్రభుత్వ మెడికల్ కాలేజీకి శాపంగా పరిణమించింది. 2024 నాటికి నిర్మాణాలు పూర్తి చేసి, అందుకు అవసరమైన సిబ్బందిని సిద్ధం చేస్తే.. ఈ ఏడాది నుంచే ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించేందుకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతి లభించేది. కాని గతేడాది (2023) డిసెంబరు నాటికి పూర్తి కావాల్సిన మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు నేటికీ 50 శాతం పూర్తికాలేదు. దీంతో ఈ ఏడాది ఎంబీబీఎస్ తరగతుల నిర్వహణకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ బృందం అనుమతిని నిరాకరించింది.

మెడికల్ కాలేజీ ప్రస్థానమిది..

రాష్ట్రంలో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఒక మెడికల్ కాలేజీని నిర్మించాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంతో పాడేరుకు మెడికల్ కాలేజీని మంజూరు చేశారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 35 ఎకరాల్లో 100 ఎంబీబీఎస్ సీట్లు, 500 పడకల సామర్థ్యంతో రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీని నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో కేంద్రం వాటాగా 350 కోట్లు కాగా, రాష్ట్రం వాటా 150 కోట్లు చెల్లించాలి. 2020 అక్టోబరు రెండో తేదీ గాంధీ జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహనరెడ్డి వర్చ్యువల్ విధానంలో స్థానిక మెడికల్ కాలేజీ నిర్మాణానికి ప్రారంభోత్సవం చేశారు.





నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ మొదటి బ్లాక్. (ఇన్‌సెట్లో) వివిధ విభాగాలకు జరుగుతున్న భవన నిర్మాణాలు

సకాలంలో నిధులు విడుదల కాని దుస్థితి

స్థానిక మెడికల్ కాలేజీ నిర్మాణానికి నిధులు విడుదలలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నిర్మాణ పనులు జోరు తగ్గాయి. వాస్తవానికి 2020లో ప్రారంభమైన నిర్మాణ పనులు 2023 డిసెంబరు నాటికి పూర్తి కావాలి. అందుకు అనుగుణంగా పనులు ... మిగతా 6వ పేజీలో



బురదలో కూరుకుపోయిన బస్సును బయటకు లాగుతున్న దృశ్యం

బురదలో కూరుకుపోయిన పీటీడీ బస్సు

- భారీగా నిలిచిన వాహనాలు
- రెండు గంటలపాటు ట్రాఫిక్ జామ్
- ఇబ్బంది పడిన ప్రయాణికులు, వాహనదారులు
- బస్సును బయటకు తీయించిన పీటీడీ పాడేరు డిపో మేనేజర్



బారులు తీరి నిలిచిపోయిన వాహనాలు

పాడేరు రూరల్, జూలై 7: పాడేరు-జి.మాడుగుల ప్రధాన రహదారిలో ఆదివారం ఉదయం బురదలో బస్సు కూరుకుపోవడంతో రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాడేరు పీటీడీ డిపోకు చెందిన బస్సు ఆదివారం ఉదయం చింతపల్లి నుంచి పాడేరు వస్తుండగా మండలంలోని బొక్కెళ్ల సమీపంలోని లాడాపుట్టు వద్ద కొత్తగా వేస్తున్న రహదారి బురదలో ఉదయం 9 గంటలకు కూరుకుపోయింది. దీంతో ఆ మార్గంలో చింతపల్లి, జీకేవీధి తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు, జి.మాడుగుల, చింతపల్లి ప్రాంతం నుంచి పాడేరు వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనాలు రెండు గంటల మేర నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న డిపో మేనేజర్ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి ఎక్స్‌కవేటర్‌ను తీసుకువెళ్లి బురదలో చిక్కుకున్న బస్సును బయటకు తీయించారు. ట్రాఫిక్ క్లియర్ కావడంతో ప్రయాణికులు, వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.

చేయి చేయి కలిపారు.. పాఠశాల షెడ్డును నిర్మించారు

- ఆరేళ్ల క్రితం తొలగించిన శిథిల భవనం
- వసతి లేక అవస్థలు పడుతున్న కెందుగూడ విద్యార్థులు, ఉపాధ్యాయులు
- పాఠశాలలో కొరవడిన మౌలిక సదుపాయాలు
- ఎన్ని వినతులు ఇచ్చినా పట్టించుకోని పాలకులు, విద్యా శాఖాధికారులు

ముంచంగిపుట్టు, జూలై 7:

అది మారుమూల గ్రామం. బాహ్య ప్రపంచానికి ఆమడదూరంలో విసిరిపడేసినట్టు ఉంటుంది. ఆ గ్రామంలో ఎక్కువ శాతం మంది నిరక్షరాస్యులే.. కానీ వారి మనసు వెన్నలాంటిది. పిల్లలు చదువుకొనేందుకు పాఠశాల భవనం లేదు. దీంతో ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు అని ఎదురుచూడకుండా ఉపాధ్యాయుల సహకారంతో గ్రామస్థులు పాఠశాలకు షెడ్డు నిర్మించి, ఎందరికో ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళితే..



పాఠశాల కోసం కెందుగూడ గ్రామస్థులు శ్రమదానంతో నిర్మించిన షెడ్డు

మండలంలోని మారుమూల కుమడ పంచాయతీ కెందుగూడ గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలలో 34 మంది విద్యార్థులు ఉన్నారు. గ్రామంలో ఉన్న పాఠశాల భవనం కాలం చెల్లిపోవడంతో ఆరేళ్ల క్రితం విద్యాశాఖ అధికారులు నేలమట్టం చేయించారు. నేటికీ ఆ స్థానంలో నూతన పాఠశాల భవనాన్ని అధికారులు నిర్మించలేదు. దీంతో చిన్న పాకలో కొన్నేళ్లుగా పాఠశాల నిర్వహణ జరుగుతుండగా.. ఇటీవల ఆ పాక నేలమట్టం అయ్యింది. గ్రామంలో పాఠశాల భవనం లేదని పాలకులు, అధికారులకు కెందుగూడ గ్రామస్థులు వినతులెన్నో ఇచ్చారు. అయినా పరిష్కారం కాలేదు. ఈ ఏడాది పాఠశాలు పునఃప్రారంభమైనా విద్యా శాఖ అధికారులు భవన నిర్మాణంపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో చేసేది లేక ఆ పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో గ్రామస్థులు శ్రమదానంతో చిన్న షెడ్డును నిర్మించారు. గ్రామస్థులు, విద్యార్థులు శ్రమించి వెదురుకర్రలు, మట్టి, పేడతో తాత్కాలిక షెడ్డుని సిద్ధం చేశారు. విద్యార్థులు చదువుకొనేందుకు వీలుగా ఆ షెడ్డును తయారు చేశారు. భవన సౌకర్యం లేకపోవడంతో చినుకులు పడితే పాఠశాల నిర్వహణ కష్టమవుతుందని ఉపాధ్యాయులు, గ్రామస్థులు వాపోయారు. అధికారులు స్పందించి పక్కా భవనం నిర్మించాలని వారు ముక్తకంఠంతో కోరుతున్నారు.



షెడ్డు లోపలి భాగం..

పాఠశాల భవనం నిర్మించాలి



-పి.రాంబాబు, కెందుగూడ గ్రామం

తమ గ్రామంలో పాఠశాలకు పక్కా భవనం నిర్మించాలి. ఈ విషయాన్ని అధికారులకు పలుమార్లు తెలిపినా స్పందించలేదు. భవనం లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణం జరిగే విధంగా అధికారులు చొరవ చూపాలి.

చదువుకునేందుకు ఇబ్బందులు



-పి.గంగవి, విద్యార్థి, 5వ తరగతి

భవనం లేకపోవడం, మౌలిక సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. నూతన భవనంతోపాటు తాగునీటి పథకం, మరుగుదొడ్లు నిర్మించాలి. ప్రస్తుతం కాలం ఏదైనప్పటికీ మాకు ఇబ్బందులు తప్పడం లేదు.

టీచర్‌ని పంపండి పాఠశాలకు షెడ్డును మేమే వేస్తాం

- శ్రమదానంతో నిర్మిస్తున్న తెంగలబంద గిరిజనులు
- ప్రారంభోత్సవానికి కలెక్టర్, పీవోలకు ఆహ్వానం
- అంగీకరించిన జిల్లా అధికారులు



శ్రమదానంతో పాఠశాలకు షెడ్డును నిర్మిస్తున్న తెంగలబంద గిరిజనులు

అరకులోయ, జూలై 7: పిల్లల భవిష్యత్తుపై మారుమూల గ్రామాల గిరిజనుల్లో సైతం చైతన్యం వచ్చింది. చిన్నారుల విద్యకు వారు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్న దానికి ఈ ఘటనే ఉదాహరణగా చెప్పవచ్చు. ఉపాధ్యాయుడిని పంపిస్తే పాఠశాలకు అవసరమైన షెడ్‌ను తామే నిర్మిస్తామని గిరిజనులు విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు అంగీకరించారు. దీంతో శ్రమదానంతో పాఠశాలకు షెడ్‌ను తెంగలబంద గిరిజనులు నిర్మిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

అనంతగిరి మండలం కివర్ల పంచాయతీ పరిధిలోని మారుమూల తెంగలబంద గ్రామంలో 25 మంది బడిఈడు పిల్లలు ఉన్నారు. వీరందరు పాఠశాలకు వెళ్లాలంటే ప్రతి రోజూ ఒకవైపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గంగవరం పాఠశాలకు వెళ్లాలి. అయితే ఆ చిన్నారులు రెండు వాగులు దాటి పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుంది. వర్షాకాలంలో ఈ వాగులు ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. దీంతో పిల్లలు వాగుల ప్రవాహాన్ని దాట లేక ఉధృతి తగ్గే వరకు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుంది. గంగవరం పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నందున ఒక టీచర్‌ను తమ గ్రామానికి పంపాలని, పాఠశాలకు అవసరమైన షెడ్‌ను తామే శ్రమదానంతో నిర్మిస్తామని మండల విద్యాశాఖ అధికారులకు తెంగలబంద గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు మండల విద్యా శాఖాధికారి తెంగలబంద గ్రామాన్ని సందర్శించి వాస్తవ స్థితిగతులను గుర్తించారు. ఈ విషయాన్ని విద్యా శాఖ ...మిగతా 6వ పేజీలో



భక్తులతో కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

మన్యంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన జనం

-వార్త 6వ పేజీలో...



నిందితుడు సురేశ్ (ఫైల్)

హంతకుడి కోసం ముమ్మర గాలింపు

20కి పైగా ప్రత్యేక బృందాల ఏర్పాటు ▸▸ బాలిక హత్య కేసులో పోలీసుల ముమ్మర దర్యాప్తు

బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్న హోం మంత్రి వంగలపూడి అనిత

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెంలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను శనివారం దారుణంగా హత్య చేసిన నిందితుడు బోడ బత్తుల సురేశ్ (26) కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి స్పెషల్ బ్రాంచి, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో 20కి పైగా బృందాలతో బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, సినిమా హాళ్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో పోలీసులు మఫ్టీలో గాలిస్తున్నారు.

-మెయిన్ ఎడిషన్‌లో..

క్రైం... crime news

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పాయకరావుపేట రూరల్, జూలై 7 : మండలంలోని మంగవరం గ్రామంలో గల ఎస్సీ కాలనీలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఇందుకు సంబంధించి మృతురాలి తల్లి అజ్జమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రామారావు తెలిపిన వివరాలివి. ఎస్.రాయవరం మండలం పెట్టుగొల్లపల్లి గ్రామానికి చెందిన దార్ల అజ్జమ్మ కూతురు కుమారికి పాయకరావుపేట మండలం మంగవరం గ్రామానికి చెందిన బడే నాగేశ్వరరావుతో పద్నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఆ సమయంలో రూ.60వేల కట్నంతో పాటు నాలుగు తులాల బంగారం, సారెను పుట్టింటివారు ఇచ్చారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే అదనపు కట్నం కోసం ఆమెను భర్త నాగేశ్వరరావు వేధిస్తూ మూడు నెలల క్రితం పుట్టింటికి పింపించేశాడు. పదిహేను రోజుల క్రితం తన కుమార్తెను మళ్లీ కాపురానికి పంపామని అజ్జమ్మ ఆ ఫిర్యాదులో పేర్కొంది. శనివారం రాత్రి 7.30 గంటల సమయంలో తన కుమార్తెకు ఫిట్స్ వచ్చి సీరియస్‌గా ఉన్నట్టు తన మనుమడు ఫోన్ చేయగా, బంధువులతో కలిసి మంగవరం వచ్చామని ఫిర్యాదులో ఆమె తెలిపింది. ఇంతలో తన కుమార్తె మృతదేహం ఇంటి బయట మంచంపై ఉందని, అలుడ్ని ప్రశ్నించగా ఉరి వేసుకుని చనిపోయిందని కోపంగా చెప్పాడని వివరించారు. తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని ఆ ఫిర్యాదులో ఆమె తెలిపిందని ఎస్‌ఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

నక్కపల్లి, జూలై 7 : మండలంలోని ఉద్దండపురం హైవే వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. తునికి చెందిన కుందూరు దుర్గా ప్రసాద్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం అడ్డరోడ్డు నుంచి ఆటోలో ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకుని పాయకరావుపేట వెళ్తుండగా, కారు సడన్ బ్రేక్ వేయడంతో ఆటో కారును ఢీకొంది. దీంతో దుర్గాప్రసాద్ గాయాలకు గురికాగా, స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- బ్రిడ్జిపై ఉన్న రక్షణ గోడను బలంగా ఢీకొన్న లారీ
- ముందు భాగం నుజ్జు
- డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు



బ్రిడ్జిపై రక్షణ గోడను ఢీకొన్న లారీ

సబ్బవరం, జూలై 7: మండలంలోని నూరెడ్డిపాలెం వద్ద అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారిపై త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. పశ్చిమ బెంగాల్ నుంచి శని వారం బియ్యం లోడుతో కేరళకు లారీ బయల్దేరింది. ఆది వారం తెల్లవారుజామున నూరెడ్డి పాలెం వద్దకు వచ్చే సరికి డ్రైవర్ ఉజ్జల్ పగ్రే ఒక్కసారిగా నిద్రమత్తులోకి జారుకోవడంతో అక్కడి బ్రిడ్జిపై ఉన్న రక్షణ గోడపైకి వాహనం దూసుకుపోయి ఆగిపోయింది. అదృష్టవశాత్తు డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లారీ ముందుభాగం నుజ్జయ్యింది. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిది కిలోల గంజాయితో మహిళ అరెస్టు

కూర్మన్నపాలెం, జూలై 7: గంజాయి రవాణా చేస్తున్న మహిళను దువ్వాడ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలివి. అనకాపల్లి జిల్లా సబ్బవరం నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్‌కు గంజాయి తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు దువ్వాడ నాగదేవత కొండ వద్ద మాటు వేసి పోలీసులు వాహనాల తనిఖీని చేపట్టారు. ఓ బస్సులో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన కె.చిలకమ్మ అనే మహిళ దువ్వాడ రైల్వే స్టేషన్‌కు పాలిథిన్ బ్యాగుల్లో సుమారు ఎనిమిది కిలోల గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించారు. ఈ మేరకు గంజాయిని స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆమెను అరెస్టు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడిన 69 మంది అరెస్ట్

రూ. 37. 12 లక్షల చోరీ సొత్తు స్వాధీనం : సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పలు చోరీలకు పాల్పడిన 69 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.37.12 లక్షల విలువైన సొత్తుని స్వాధీనం చేసుకున్నారు. ఆయా కేసుల్లో బాధితులకు రికవరీ సొత్తును అందజేసేందుకు పోలీస్ కమిషనరేట్‌లో ఆదివారం 'రికవరీ మేళా' ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీపీ శంఖబ్రతబాగ్చి మాట్లాడుతూ నగరంలో గత నెలలో 99 చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. ఆయా కేసుల్లో రూ.78.60 లక్షల విలువైన సొత్తు అపహరణకు గురైందన్నారు. వీటిలో 66 కేసులను చేధించామన్నారు. గతంలో జరిగిన చోరీలకు సంబంధించి మరో 14 కేసులను కూడా చేధించామన్నారు. మొత్తంగా 80 కేసులను చేధించామని తెలిపారు. వీటిలో దోపిడీ ఒకటి, పగటి దొంగతనాలు మూడు, రాత్రి పూట ఇళ్లలో చోరీలు, ఆటో, కారు చోరీలు, 16 సాధారణ చోరీలు, తొమ్మిది చైన్‌స్నాచింగ్‌లు, 24 మోటారుసైకిళ్లచోరీలు, ఏడు వైర్ల చోరీలు, జేబు దొంగతనం ఒకటి, మిగిలిన ఇతర చోరీలకు సంబంధించిన కేసులు ఉన్నాయని తెలిపారు. ఆయా నేరాలకు పాల్పడిన 69 మందిని అదుపులోకి తీసుకుని రూ. 37. 12 లక్షల విలువ చేసే 381.93 గ్రాముల బంగారం, 501.36 గ్రాములు వెండి, రూ.7.94 లక్షలు నగదు, 24 బైక్‌లు, ఒక ఆటో, కారుతో పాటు ఇతర విలువైన సొత్తు రికవరీ చేశామన్నారు. అదుపులోకి తీసుకున్న వారిలో 12 మంది మైనర్లు ఉన్నారన్నారు. చోరీ నియంత్రణలో భాగంగా నగరంలో రాత్రి పెట్రోలింగ్‌ను బలోపేతం చేశా మని, గత నెలలో 338 సీసీ కెమెరాలు కొత్తగా ఏర్పాటు చేశామని, చోరీల నియంత్రణకు 120 అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. నేరాలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేకంగా క్రైమ్ బీట్‌లు వేస్తున్నామన్నారు. 2022లో 820 చోరీలు నమోదు కాగా రూ.5.79 కోట్ల సొత్తు అపహరణకు గురైందన్నారు. వీటిలో 660 కేసులు ఛేదించి రూ.మూడు కోట్ల విలువైన సొత్తుని రికవరీ చేశామన్నారు. గత ఏడాది 678 చోరీకేసుల్లో రూ.5.29 కోట్లు సొత్తు అపహరణకు గురైతే, వాటిలో 482 కేసులు చేధించి రూ.3.36 కోట్లు విలువైన సొత్తు రికవరీ చేశామన్నారు. 2024లో ఇప్పటివరకూ 504 చోరీలు జరిగితే వీటిలో 333 కేసులను చేధించామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప, క్రైమ్ డీసీపీ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కొప్పుగొండుపాలెంలో విషాద ఛాయలు

రాంబిల్లి, జూలై 7 : మండలంలోని కొప్పుగొండుపాలెంలో శనివారం జరిగిన బాలిక హత్య కేసు ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. పరారీలో ఉన్న నిందితుడు సురేశ్‌ను త్వరితగతిన పట్టుకుని అరెస్టు చేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించిన నేపథ్యంలో సుమారు పన్నెండు ప్రత్యేక బృందాలు నిందితుడ్ని పట్టుకునే పనిలో ఉన్నాయని రాంబిల్లి సీఐ నర్సింగరావు తెలిపారు. కాగా, ఆదివారం సాయంత్రం పోస్టుమార్టం అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి బాలిక మృతదేహాన్ని కొప్పుగొండుపాలెం గ్రామానికి తీసుకు వచ్చారు. మృతదేహాన్ని చూసి గ్రామస్థులంతా కన్నీరుమున్నీరుగా విలపించారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని అంతా కోరారు.


చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

ప్రగతి వెలుగులు

సింహాద్రి విద్యుత్ ప్లాంట్‌కు నేటితో 27 ఏళ్లు

- రెండు వేల మెగావాట్ల సామర్థ్యంతో సేవలు
- పర్యావరణ, భద్రత ప్రమాణాలు పాటించడంలో ఎన్నో అవార్డులు
- సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పరిమళాలు
- నేడు సింహాద్రి ఎన్టీపీసీ వ్యవస్థాపక దినం


సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)

సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ) ఆంధ్ర, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో వెలుగులను నింపుతూ మహారత్న కంపెనీగా ఎదిగింది. తొలి, మలి దశల్లో రెండువేల మెగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని పూర్తి చేసుకుంది. నాణ్యమైన విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ ప్రగతి పథంలో పయనిస్తోంది. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతోంది.

పరవాడ, జూలై 7 : ఉమ్మడి విశాఖ జిల్లా పరవాడలో 1997లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం సింహాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేసింది. ఇందుకు రూ.3,700 కోట్లు కేటాయించింది. దీనిని ఏర్పాటుకు రైతుల నుంచి 3,400 ఎకరాల స్థలాన్ని సేకరించింది. నిర్మాణం పూర్తి చేసుకొని వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని 2007లో శ్రీకారం చుట్టింది. మలి విడతగా మరో వెయ్యి మెగావాట్ల కేంద్రాన్ని స్థాపించి రెండు వేల మెగావాట్ల సామర్థ్యానికి చేరుకుంది. ఎన్టీపీసీ ఏర్పాటై సోమవారానికి 27 ఏళ్లు పూర్తి చేసుకుంది. సింహాద్రి ఎన్టీపీసీలో విద్యుదుత్పత్తికి అవసరమైన బొగ్గును ఒడిశా, సింగరేణి, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకొంటున్నారు. రెండు వేల మెగావాట్ల విద్యుదుత్పత్తికి గాను 30వేల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరమవుతుంది. విద్యుదుత్పాదనకు అవసరమైన నీటిని ఏలేరు కాలువ, తిక్కవానిపాలెం సముద్రం నుంచి పైపులైన్ల ద్వారా తీసుకొని వినియోగిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, భద్రత ప్రమాణాలు పాటించడంలో విశేష కృషి చేస్తున్న సింహాద్రి ఎన్టీపీసీకి పలు అవార్డులు లభించాయి. అలాగే, సామాజిక బాధ్యతలో భాగంగా సింహాద్రి ఎన్టీపీసీ గ్రామీణాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నది. సంస్థ సీఎస్ఆర్ నిధుల నుంచి 2019-24 ఏళ్లలో నిర్వాసిత గ్రామాల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు వెచ్చించింది.


ప్లాంట్ లోపల ఉన్న టర్బైనర్

తిక్కవానిపాలెం తీరంలో అతి పెద్ద జెట్టీ

సంస్థలో విద్యుదుత్పానకు అవసరమైన సముద్రపు నీటిని ఉపయోగించుకోవడానికి తిక్కవానిపాలెం తీరంలో ఏడు వందల మీటర్ల లోపల నిర్మించిన జెట్టీ దేశంలోనే అతి పెద్దదిగా పేర్కొనవచ్చు. ప్లాంటులో 275 మీటర్ల ఎత్తులో నిర్మించిన రెండు చిమ్నీలు ఆసియా ఖండంలోనే అతి పెద్దవిగా చెప్పవచ్చు. ఇలాగే 15 మీటర్ల ఎత్తులో నిర్మించిన నాలుగు కూలింగ్ టవర్లు దేశంలోనే పెద్దవి. అలాగే, సింహాద్రి రిజర్వాయర్‌పై 25 మెగావాట్ల సామర్థ్యం గల నీటిపై తేలియాడే (ఫ్లోటింగ్) సౌర విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి



సింహాద్రి ఎన్టీపీసీ ప్రగతి పథంలో పయనిస్తూ మంచి పనితీరును కనబరుస్తోంది. ఇది ఉద్యోగులు, కార్మికులు, పరిసర గ్రామాల ప్రజల సమిష్టి కృషితోనే సాధ్యమైంది. ఇప్పటికే సీఎస్ఆర్ భాగంగా నిర్వాసిత పరిసర గ్రామాల్లో రూ. కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు, సేవా కార్యక్రమాలు చేపట్టాం. మున్ముందు మరిన్ని నిధులు కేటాయిస్తాం. పర్యావరణ పరిరక్షణ నిమిత్తం 10 లక్షల మొక్కలు నాటాం. యాష్ పాండు వద్ద కాలుష్య నివారణకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాం.

- సంజయ్‌కుమార్ సిన్హా, సీజీఎం, సింహాద్రి ఎన్టీపీసీ

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- గత ప్రభుత్వంలో పెట్టిన కేసులు తొలగించేందుకు న్యాయ నిపుణుల సలహాతో చర్యలు
- హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడి
- పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ఘన సత్కారం


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిని సత్కరిస్తున్న మంత్రి అనిత, చిత్రంలో ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల తదితరులు

అనకాపల్లి టౌన్, జూలై 7: టీచర్ అనే పదంలో తెలియని శక్తి ఉందని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఇక్కడి నూకాంబిక ఆలయ సమీపంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ప్రతిభకు పట్టాభిషేకం పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లాలోని 80 మంది విద్యార్థినీ విద్యార్థులను, పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించిన 37 మంది పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అనిత మాట్లాడుతూ మహోన్నతమైనది ఉపాధ్యాయ వృత్తి అన్నారు. గత ఐదేళ్లుగా టీచర్లు పోరాటం చేశారని, వారి పోరాటంలో న్యాయం ఉందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు చెప్పనీయకుండా నాడు- నేడు పనుల్లో కంకర, సిమెంట్, టాయిలెట్ ఫొటోలు తీయమంటే ఉత్తమ ఫలితాలు ఎలా వస్తాయని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజన్ ప్రభుత్వం ఉందన్నారు. గత ప్రభుత్వం తనపై కూడా 23 కేసులు పెట్టిందని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయులపై కూడా కేసులు నమోదు చేసిందని, వీటిని తొలగించేందుకు న్యాయ నిపుణుల సలహాతో చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. వారిని ఎన్నికల విధుల్లో ఉండనీయకుండా ప్రయత్నం చేసిందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. పది ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను బహూకరిస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ సమూలంగా నాశనమైందన్నారు. దీనివలన ఉపాధ్యాయులు, విద్యార్థులు గందరగోళంలో పడే పరిస్థితి నెలకొందన్నారు. మంచి ప్రభుత్వం అధికారంలో ఉందని, రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. అనంతరం మంత్రి అనితను యూనియన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పీఆర్‌టీయూ జిల్లా కన్వీనర్ డి.గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీలు బుద్ద నాగజగదీశ్వరరావు, గాదె శ్రీనివాసులునాయుడు, డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ డీఈవో పి.అప్పారావు, టీడీపీ నాయకులు బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, పీఆర్‌టీయూ ప్రతినిధులు బుద్ద కాశీ, ఎం.శ్రీను, పెద్దినాయుడు, ఎం.నాగేశ్వరరావు, కె.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను గోపీనాథ్ మంత్రికి వివరించారు.

ప్రతి మండలంలో ఐదు వేల మందికి ఉపాధి

- ప్రగల్భాలు పలికిన 'బూడి' బాగోతాలు బయట పెడతా
- ప్రజల ముందు దోషిగా నిలబెడతా : అనకాపల్లి ఎంపీ రమేశ్


దేవరాపల్లి సభలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్, చిత్రంలో ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి, జూలై 7 : ప్రతి మండలం నుంచి ఐదు వేలమంది నిరుద్యోగులకు పరిశ్రమల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. స్థానిక రైవాడ అతిథి గృహం వద్ద విజయోత్సవ సభ నిర్వహించారు. తొలుత మండల నాయకులంతా లలితా థియేటర్ వరకు వెళ్లి ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో ఎంపీ రమేశ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పరిశ్రమలు లేక నిరుద్యోగ సమస్య నెలకొందన్నారు. అందుకే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటుకు అవకాశం కల్పించి ఉపాధి కల్పించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. సృజల స్రవంతి ద్వారా సాగునీరు అందించి రైతులు, యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. తనపై పోటీ చేసిన మాజీ ఉపముఖ్యమంత్రి బూడిముత్యాలనాయుడు తనను వచ్చిన దారిన చాప చుట్టి పంపుతానని ప్రగాల్భాలు పలికి ఎక్కడ ఉన్నారన్నారు. అన్యాయంగా, అక్రమంగా దోచుకున్న అక్రమ ఆస్తులను బయట పెట్టడమే కాకుండా, చేసిన తప్పులన్నీ ప్రజల ముందు ఒప్పుకొనే విధంగా దోషిలా నిలబెడతానన్నారు. ప్రజలను పెట్టిన ఇబ్బందులు వడ్డీతో తీర్చే విధంగా చేస్తానన్నారు. ఈ సందర్భంగా గజమాలతో ఎంపీని సత్కరించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు రైవాడ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని రైతులకు కోల్డ్ స్టోరేజీ, డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి చేయాలని నాయకుల దృష్టికి తీసుకు వెళ్లారు. దేవరాపల్లి మండలంలోని సమస్యలను మండల పార్టీ అధ్యక్షుడు సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ప్రస్తావించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీజీ కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు సురేంద్రకుమార్, బండారు అప్పలనాయుడు, జనసేన నాయకులు గొర్రుపోటు రామ్మూర్తినాయుడు, చెరకాన సూర్యనారాయణ, పాత్రునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పకు కృషి చేస్తానని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. కె.కోటపాడులో కూటమి ఆధ్వర్యంలో అభినందన సభ ఆదివారం ఏర్పాటు చేశారు. తొలుత చౌడువాడ నుంచి తొమ్మిది కిలోమీటర్ల మేర కూటమి శ్రేణులు సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిలను భారీ ఊరేగింపు చేపట్టి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీ రమేశ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంతో కొత్త పరిశ్రమలు రాలేదు సరికదా ఉన్నవి వేరే రాష్ట్రాలకు తరలిపో యేలా వికృత పాలన చేపట్టిందన్నారు. పరిశ్రమలు లేకపోవడంతో ఎంతో మంది యువత ఉద్యోగ, ఉపాధి లేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ జిల్లాలోనే మాడుగుల నియోజకవర్గం ఎంతో వెను కబడి ఉందని ఎటువంటి ఆర్థిక వనరులు లేవన్నారు. పినగాడి నుంచి దేవరాపల్లి వరకు నాలుగు లైన్ల రహదారి ఏర్పాటు చేయాలని ఎంపీని కోరారు. అలాగే వ్యవసాయధారిత పరిశ్రమలు నెలకొల్పి ఇక్కడున్న యువతకు ఉపాధి కల్పించాలన్నారు. రైతులకు ప్రయోజ నం కలిగేలా చూడాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, సీనియర్ నాయకులు పీవీజీ కుమార్, మాజీ వీసీ ముర్రు ముత్యాల నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, కూటమి నేతలు బాలిబోయిన సంతోష్, కొటాన ఈశ్వరరావు, చల్లా సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న కొండపై త్వరలో శంఖు, చక్ర, తిరు నామాల ఏర్పాటు

సింహాచలం, జూలై 7 : వరాహలక్ష్మీన్రసింహస్వామి కొలువుదీరిన సింహగిరిపై ఈశాన్య పర్వతం వైపు గతంలో మాదిరి శంఖు, చక్ర, తిరు నామాలు ఏర్పాటు చేయడానికి దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి చొరవతో సన్నాహాలు పూర్తి చేశారు. 2014లో హుద్‌హుద్ తుఫాన్ ధాటికి సింహగిరిపై ఏర్పాటు చేసిన శంఖు, చక్ర, తిరునామాలు పడిపోయాయి. నాటి నుంచి వాటిని పునరుద్ధరించడంలో అధికారులు విఫలమయ్యారు. తాజాగా జీఆర్‌టీ జ్యూవెలర్స్ సంస్థ ముందుకు వచ్చి రూ. 85 లక్షలు వెచ్చించి వాటి పనులను చేపట్టింది. ఇవి దాదాపు పూర్తి కావొచ్చాయి. సింహగిరి ప్రదక్షిణలోపు వాటిని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించనున్నట్టు ఈవో తెలిపారు. ఇదిలావుంటే స్వామికి నాలుగో విడత చందన సమర్పణ ఈనెల 21న జరగనుంది. ఆషాడమాస శుక్లపక్ష దశమి అనగా ఈనెల 16న చందనం అరగదీతను ప్రారంభించేందుకు ఆలయ బేడా మండపంలో ప్రత్యేక సానరాళ్లను శుభ్రం చేసి సిద్ధం చేస్తున్నారు.




జగన్నాథుని రథాన్ని లాగుతున్న భక్తులు

అంగరంగ వైభవంగా జగన్నాథస్వామి రథోత్సవం

- వేడుకలను ప్రారంభించిన ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల
- దారి పొడవునా దర్శించుకున్న భక్తులు
- అనంతరం ఇంద్రజ్యుమ్న హాల్ వద్ద కొలువుదీర్చిన అర్చకులు


వేడుకల్లో ఆకట్టుకున్న పులివేషాలు

అనకాపల్లి టౌన్, జూలై 7: సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి రథోత్సవం అనకాపల్లి పట్టణంలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. గవరపాలెం అగ్గిమర్రి చెట్టు వద్ద గల ఆలయంలో అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ తొలుత ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఎంపీ సీఎం రమేష్ దంపతులు రథం వద్దకు తీసుకువచ్చి అధిష్ఠించారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం ఎంపీ రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ వేడుకల్లో భాగంగా దారి పొడవునా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గవరపాలెంలో రథయాత్ర పూర్తయిన తరువాత చిననాలుగు రోడ్ల జంక్షన్ నుంచి స్టేషన్ రోడ్డు మీదుగా గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రజ్యుమ్న హాల్‌కు రాత్రికి చేరుకుంది. అర్చకులు ఉత్సవమూర్తులను అక్కడ అధిష్ఠించి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ జి.శంకరరావు, ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, ఆలయ ఈవో రాజసులోచన, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, మళ్ల సురేంద్ర, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




విశాఖపట్నంలోని టౌన్ కొత్త రోడ్డులో జగన్నాథస్వామి తొలి రథ యాత్ర ఆదివారం నేత్రపర్వంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. - విశాఖపట్నం

సరికొత్త ఫీచర్లతో ఈపీడీసీఎల్ మొబైల్ యాప్

- ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీ డీసీఎల్) ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌ను సరికొత్త ఫీచర్లతో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రక టన విడుదల చేశారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని విని యోగదారుడి 16 అంకెల సర్వీసు నెంబరు నమోదు చేసుకోవడం ద్వారా యాప్ సేవలను పొందవచ్చన్నారు. యాప్‌లో బిల్ పే ఆప్షన్ ద్వారా విద్యుత్ బిల్లులను ఎటువంటి అదనపు రుసుం లేకుండా అత్యంత సుల భతరంగా చెల్లించవచ్చని వివరించారు. వినియోగ దారుడి సర్వీసుకు సంబంధించిన విద్యుత్ వినియోగం, బిల్లు వివరాలు, చెల్లింపు, సరఫరా పరిస్థితి తదితర వివరాలను కూడా తెలుసుకోవచ్చన్నారు. మై యూసెజ్ ఆప్షన్ ద్వారా విద్యుత్ మీటర్‌లో ఉన్న రీడింగ్ ప్రకారం కేవలం వినియోగపు యూనిట్లను సంఖ్యను నమోదు చేయడం ద్వారా విద్యుత్ బిల్లును వినియోగదారులే యాప్ ద్వారా లెక్కించుకోవచ్చన్నారు. యాప్ ద్వారా ఆధార్ నెంబర్‌కు విద్యుత్ సర్వీసును అనుసంధానం చేసుకోవడంతో పాటు విద్యుత్ సంబంధిత సమస్యలను ఫిర్యాదు చేయవచ్చన్నారు. పేటీఎం, ఫోన్ పే, జీపేతో సహా ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా బిల్లులు నేరుగా చెల్లించే విషయంపై ఆర్‌బీఐ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ పాత విధానంలోనే ఫోన్ పే, పేటీఎం, జీ పేలు ద్వారా వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వీలుగా బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు వెల్ల డించారు. ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్‌లో గాని, సంస్థ వెబ్‌సైట్‌లో గాని బిల్లులు చెల్లించే సమయంలో వినియోగదారులు తమ ఫోన్ పే, జీ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌తో పాటు నెట్‌బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డులు, వాలెట్స్, క్యాష్ కార్డ్ కూడా వాడుకోవచ్చని సీఎండీ పేర్కొన్నారు.



పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్‌తో భయం భయం

డుంబ్రిగుడ, జూలై 7: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలురు ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. విద్యార్థులు, బాటసారులకు అందే విధంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచే విద్యార్థులు, గ్రామస్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఏ సమయంలో ఏం జరుగుతందోనని వారంతా ఆందోళన చెందుతున్నారు. ఎటువంటి ప్రమాదం జరగకముందే సంబంధిత శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటకు మార్చాలని, లేనిపక్షంలో తగిన రక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

పెదబయలులో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

పెదబయలు: మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల-1 సమీపంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. పెదబయలు నుంచి ముంచంగిపుట్టు వైపు వెళుతున్న విద్యుత్ తీగలు భూమికి ఆరడుగుల ఎత్తులో వేలాడుతూ ఉండడంతో ప్రమాదం పొంచివుంది. పాఠశాల విద్యార్థినులు బహిర్భూమికి అటువైపే వెళ్తుంటారు. అలాగే పశువులు మేత కోసం కూడా అక్కడే ఉంటాయి. అసలే వర్షాకాలం కావడంతో గాలివానకు విద్యుత్ తీగలు కింద పడితే ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని, ఈ సమస్యపై సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు, విద్యార్థినుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అందుబాటులోకి మంచినీటి పథకం

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు, పాలకులు



నరమామిడిగొందిలో కొళాయిల నుంచి నీరు పట్టుకుంటున్న మహిళలు

సీలేరు, జూలై 7: గూడెంకొత్తవీధి మండలంలోని ధారకొండ పంచాయతీ నరమామిడిగొంది గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఈ గ్రామంలో నీటి సమస్యపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితం కావడం, ఖాళీ బిందెలతో మహిళల నిరసన తెలపడంపై అధికారులు, పాలకులు స్పందించారు. ఈ మేరకు ధారకొండ కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ ఎస్.రాజు, ఎంపీటీసీ సభ్యుడు మాడి రామన్న తదితరులు కాంట్రాక్టర్ చీర్ల రమేష్‌ను గ్రామానికి తీసుకువెళ్లి మంచినీటి పథకం బోరు మోటారుకు సంబంధించిన బోర్డును మరమ్మతులు చేయించారు. ఫలితంగా గ్రామంలో రెండేళ్లుగా నెలకొన్న మంచినీటి సమస్య తీరింది. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

పాడేరు రూరల్, జూలై 7: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ గ్రామాల ప్రజలతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. దీంతో ఆదివారం ఉదయం 7 గంటల నుంచే ఆలయం భక్తులతో సందడిగా మారింది. మొక్కులు తీర్చుకొనేందుకు వచ్చిన మైదాన ప్రాంత భక్తులు అమ్మవారికి ఘటాలను సమర్పించి ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోనే వంటలు చేసుకొని బంధుమిత్రులతో సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు. అలాగే పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్ద ఉన్న అమ్మవారి పాదాలకు మైదాన ప్రాంతం నుంచి వందలాది మంది భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న కమ్యూనికేషన్ డీఐజీ



డీఐజీ లక్ష్మిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పాడేరు రూరల్: మోదకొండమ్మను కమ్యూనికేషన్ పోలీసు డిపార్టుమెంట్ డీఐజీ ఎస్ఎస్‌జే.లక్ష్మి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువతో సత్కరించి అమ్మవారి చిత్రపటం బహూకరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కె.కోటిబాబునాయుడు, కె.రామారావు, బీవీఎస్.ముకుందరావు, ఎస్.శ్రీనివాస్‌కుమార్, ఎస్.కొండల రావు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య సైకిల్ యాత్రికుడికి సన్మానం

పాడేరు రూరల్, జూలై 7: అయోధ్యకు సైకిల్ యాత్ర చేపటిన జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వీరాభిమాని కొలిమల్ల పెంటారావు ఆదివారం మోదకొండమ్మను దర్శించు కున్నారు. అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం పొట్టిదొరపాలెం గ్రామానికి చెందిన కొల్లిమల్ల పెంటారావు పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేగా ఎన్నికైతే అయోధ్యకు సైకిల్ యాత్ర చేపడతానని మొక్కుకున్నారు. ఈ మేరకు అనకాపల్లి నుంచి సైకిల్‌పై అయోధ్య వెళ్లిన పెంటారావు, తిరుగు ప్రయాణంలో ఆదివారం పాడేరు చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న ఆయన్ను జనసేన అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంపూరు గంగులయ్య ఆలయానికి చేరుకుని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



మోదకొండమ్మ ఆలయంలో పెంటారావును సత్కరిస్తున్న జనసేన నాయకులు

టీచర్‌ని పంపండి..

... 3వ పేజీ తరువాయి

ఉన్నతాధికారులకు ఎంఈవో నివేదించారు. దీంతో ఒక టీచర్‌ను తెంగలబంద గ్రామానికి పంపేందుకు ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చారు. ఈ విషయాన్ని ఎంఈవో గ్రామస్థులకు తెలియజేయడంతో వారు పాఠశాల షెడ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో ఇంటి రూ.300 చొప్పున వసూలు చేసి షెడ్‌కు అవసరమైన పెంకులు కొనుగోలు చేశారు. కర్రలు, వెదురుతో షెడ్‌ను ఏర్పాటు చేసి, పైకప్పుపై పెంకులు వేయనున్నారు. ఇదే విషయాన్ని శుక్రవారం పాడేరులో జరిగిన మీకోసం కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గోవిందరావు, గ్రామస్థులు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోలకు తెలియజేశారు. పాఠశాల ప్రారంభానికి రావాలని ఆహ్వానించారు. పిల్లల చదువు కోసం గ్రామస్థులు చూపించిన శ్రద్ధను వారు అభినందించారు. షెడ్ పూర్తయినట్టు సమాచారం ఇస్తే తప్పకుండా వచ్చి పాఠశాలను ప్రారంభిస్తామని కలెక్టర్, ఐటీడీఏ పీవో గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

కొయ్యూరులో కళాశాల విద్య.. మిథ్య

గిరిజన బాలికలకు కళాశాల విద్య అందనంత దూరమవుతోంది. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన బాలికలు ఆపై చదువులకు అవకాశాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి దాపురిస్తోంది. ఈ విషయం తెలిసినప్పటికీ పాలకులు, అధికారుల్లో చలనం లేకపోతోంది.

» టెన్త్ పాసైన గిరిజన బాలికల ఆపై చదువులకు అవకాశాలు నిల్
» పాడేరు, చింతపల్లి, నర్సీపట్నం వెళ్లాలంటే తలకు మించిన భారం
» వ్యయప్రయాసాలకోర్చలేక అక్కడితోనే ఆపేస్తున్న తల్లిదండ్రులు
» సమస్య తెలిసినా పట్టించుకోని ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు

కొయ్యూరు, జూలై 7:

మండలంలో ఆరు గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహాలతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థినులు ప్రతీ ఏటా సుమారు 400 దాటి ఉంటున్నారు. ఆపై చదువుల కోసం కళాశాలలు లేక పోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా అవకాశం లేకపోవడంతో కొంత మంది పదో తరగతితోనే ఆగిపోతుండగా, మరి కొంత మంది పాడేరు, చింతపల్లితో పాటు నర్సీపట్నం తదితర మైదాన ప్రాంతాల్లోని ప్రైవేటు కళాశాలల్లో చేరాల్సి వస్తోంది. ఇతర ప్రాంతాలలో చదివించడానికి విద్యార్థినుల తల్లిదండ్రులు ఇష్టపడకపోవడంతో మరి కొంత మంది మధ్యలోనే చదువులకు దూరమవుతున్నారు.

రెండేళ్ల క్రితం వరకు కొంత మందికైనా కాకరపాడు గురుకుల కళాశాలలో ప్రవేశాలు కల్పించడంతో ఈ సమస్య నుంచి కొంత వరకు ఉపశమనం లభించేది. ప్రస్తుతం ఆ అవకాశం లేకపోవడంతో పలువురు విద్యార్థినులకు పై చదువులు ప్రశ్నార్థకమయ్యాయి.



నిరుపయోగంగా దర్శనమిస్తున్న కాకరపాడు పోస్టుమెట్రిక్ వసతిగృహ భవనాలు

ఈ విషయంలో నూతనంగా గిరిజన సంక్షేమ శాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన గుమ్మడి సంధ్యారాణితో పాటు జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సి అవసరం ఎంతైనా ఉంది. పోస్టుమెట్రిక్ భవనంలో మహిళ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేలా వారు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో గతంలో మాదిరి కాకరపాడు గురుకుల కళాశాలలో ప్రవేశాలకు అనుమతులైనా ఇప్పించాలని గిరిజన విద్యార్థినుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

గిరిజన ప్రాంతంలో మానవ హక్కుల ఉల్లంఘన

» మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్

అరకులోయ, జూలై 7: గిరిజన ప్రాంతంలో మానవహక్కులు-చట్టాల ఉల్లంఘన ఎక్కువగా జరుగుతున్నదని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్యామ్‌ప్రసాద్ ఆరోపించారు. ఆదివారం ఓ ప్రైవేటు రిసార్టు సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉండడం, మారుమూల ప్రాంతాలే అధికం కావడంతో మానవ హక్కులు-చట్టాలు వంటివి ఉన్నాయన్న విషయం చాలా మందికి తెలియదన్నారు. మానవ హక్కుల పరిరక్షణకు, హక్కుల ఉల్లంఘనతో బాధితులైన వారికి న్యాయం చేయడమే తమ కౌన్సిల్ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా గిరిజనులకు మానవ హక్కులు-చట్టాలపై అవగాహన కల్పించాలని, ఉల్లంఘనలు జరిగితే న్యాయం చేయడానికి మానవ హక్కులు సంఘాలు కేంద్ర, రాష్ట్ర పరిధిలో ఉన్నాయని చెప్పారు. ఇందుకు తగినట్టు మారుమూల ప్రాంతాల గిరిజనం మానవ హక్కుల ఉల్లంఘనకు గురవుతున్న వారిని గుర్తించే బాధ్యత హ్యూమన్ రైట్స్ డిఫండర్స్‌దేనని ఆయన స్పష్టం చేశారు.

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్రాలలో ఏర్పడిన ప్రభుత్వాలు వల్ల న్యాయం జరుగుతుందేని శ్యామ్‌ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం నుంచి కొన్నేళ్లుగా మానవ హక్కుల కౌన్సిల్‌లో డిఫెండర్స్‌గా సేవలు అందిస్తున్న రిటైర్డు ఎస్ఐ పైడిరాజురెడ్డి, సాగర్, స్వామి, అరకులోయ, డుంబ్రిగుడ ప్రాంతాల నుంచి ఎల్‌బీ కళావతి, ద్రౌపతి, ఎస్.దీనారాణి, కె.నిర్మల, స్వామి, రాజేష్, లక్ష్మీ, సౌజన్య తదిరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

పేద విద్యార్థులకు చేయూత

కొయ్యూరు, జూలై 7: మండలంలోని చింతవానిపాలెం గ్రామంలో పేద విద్యార్థులకు డీటీ సత్యనారాయణ ఆదివారం పలకలు, పెన్నులు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో చదువుకు ఉన్న ప్రాధాన్యత దేనికి లేదన్నారు. మన్యంలోని మారుమూల గ్రామాల్లో చిన్నారులు విద్యలో ముందుకు సాగాలనే ఆకాంక్షతో తనకు తోచిన సహాయం అందిస్తున్నానన్నారు. పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా పాఠశాలకు పంపించి విద్యాబుద్ధులు నేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, స్థానిక నాయకులు గాంధీ, చిన్నారావు, రమణ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీకి వైసీపీ ఝలక్!

... 3వ పేజీ తరువాయి

చేపట్టేందుకు దశల వారీగా విడుదల కావాల్సిన నిధులను నిర్మాణ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఏడాది పైబడి పనులు జరగని పరిస్థితి నెలకొంది. దీంతో 2022 నుంచే ఒక మోస్తరుగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో ప్రస్తుతానికి ప్రధాన భవనంతోపాటు వివిధ విభాగాలకు చెందిన భవనాల పనులు జరుగుతున్నాయి. అయితే భవనాల నిర్మాణం పూర్తి కావడానికి కనీసం మరో రెండేళ్లు పట్టే పరిస్థితి కనిపిస్తున్నది.

ఈ ఏడాది నుంచి తరగతులు లేనట్టేనా..?

స్థానిక మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణం పూర్తికానప్పటికీ, ఈ ఏడాది ఆగస్టు నుంచి తరగతులను ప్రారంభించేందుకు గతేడాదే అప్పటి వైసీపీ ప్రభుత్వం నేషనల్ మెడికల్ కౌన్సిల్‌ను కోరింది. అందులో భాగంగానే వంద మంది వైద్య విద్యార్థులకు తరగతులు నిర్వహించేందుకు అవసరమైన భవనాలను ఈ ఏడాది (2024) జూన్ నాటికి పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని పేర్కొంది. ఇప్పటికే మెడికల్ కాలేజీకి ప్రిన్సిపాల్‌ను నియమించగా, 2024-25 ఏడాదికి 100 ఎంబీబీఎస్ సీట్లను భర్తీ చేసి, తొలి ఏడాది తరగతులను ప్రారంభించాలని అప్పట్లో వైసీపీ ప్రభుత్వం భావించింది. కొత్త భవనాల్లో తరగతులు నిర్వహించి, స్థానిక జిల్లా ఆస్పత్రిలో ప్రయోగాలకు సంబంధించిన తరగతులను కొనసాగించాలనే ఆలోచనతో అధికారులున్నారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ తరగతులను ప్రారంభించేందుకు అనుమతి ఇచ్చే ప్రక్రియలో భాగంగా ఇటీవల నేషనల్ మెడికల్ కౌన్సిల్ బృందం ఇక్కడి వచ్చి, మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు, ఉన్న వసతులు, ఫ్యాకల్టీ, తదితరాలను పరిశీలించింది. అయితే తరగతుల నిర్వహణ, హాస్టల్ సదుపాయాలకు అవసరమైన భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతోపాటు బోధనకు అవసరమైన ఫ్యాకల్టీ బృందం లేదని ఎన్ఎంసీ బృందం గుర్తించింది. దీంతో ఈ ఏడాది ఎంబీబీఎస్ తరగతుల నిర్వహణకు అనుమతి నిరాకరిస్తున్నట్టు నేషనల్ మెడికల్ కౌన్సిల్ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాదికి స్థానిక మెడికల్ కాలేజీలో తరగతులు ప్రారంభించే పరిస్థితులు లేనట్టేనని స్థానిక అధికారులు అంటున్నారు. కాని ఈ ఏడాది నుంచే తరగతులను మొదలు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ మెడికల్ కౌన్సిల్‌తో సంప్రదింపులు జరుపుతున్నదని తెలుస్తున్నది.

ఐదు మెడికల్ కాలేజీల్లో తరగతులకు అనుమతి నిరాకరణ

మెరుగైన వసతులు, బోధకులు లేని కారణంగా రాష్ట్రంలో ఐదు కొత్త మెడికల్ కాలేజీల్లో ఈ ఏడాది నుంచి ఎంబీబీఎస్ తరగతులను ప్రారంభించేందుకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిరాకరించింది. పాడేరు, మార్కాపురం, పులివెందుల, ఆదోని, మదనపల్లెల్లో తరగతుల నిర్వహణకు అనుమతులు ఇవ్వలేదు. అయితే గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సొంత సెగ్మెంట్ పులివెందులలో మెడికల్ కాలేజీకి ఇదే పరిస్థితి నెలకొనడం గమనార్హం.

పనసలో భారీ వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు

వాహన చోదకుల అగచాట్లు



వరద నీటి ఉధృతికి కల్వర్టు దెబ్బతిన్న దృశ్యం

ముంచంగిపుట్టు, జూలై 7: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వనుగుమ్మ పంచాయతీ పనస గ్రామ సమీపంలో కల్వర్టు దెబ్బతింది. వరద నీటి ఉధృతికి కల్వర్టుకు రెండు వైపులా మట్టి కోతకు గురైంది. దీంతో ఈ కల్వర్టుపై నుంచి వాహన రాకపోకలు సాగించేందుకు అవరోధం ఏర్పడుతోంది. దీనికితోడు రూ.36 లక్షలతో పనస నుంచి మొక్కపుట్టు వరకు చేపడుతున్న నూతన రహదారి నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ రాజ్ శాఖాధికారులు స్పందించి వెంటనే కల్వర్టు మరమ్మతు చేయించాలని, రహదారి నిర్మాణం పూర్తి చేయాలని పంచాయతీ సర్పంచ్ కిరసాని మిల్కి కోరారు.

పేద ఒంటరి మహిళలకు ఆసరా



వితంతువులకు నిత్యావసంసరకులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

పాడేరు రూరల్, జూలై 7: మండలంలోని పేద, ఒంటరి గిరిజన మహిళలకు నవజీవన ట్రస్టు తిరుపతి వారి ఆర్థిక సహాయంతో ప్రతి నెలా రెండో శుక్రవారం ఉచితంగా నిత్యావసర వస్తువులను అందిస్తున్నామని స్థానిక నవజీవన్ ట్రస్టు నిరుపేద పిల్లల సేవా కేంద్రం ఆర్గనైజర్ జె.సద్దు తెలిపారు. గుడివాడవీధిలో ఆదివారం నిరుపేద పిల్లల సేవా కేంద్రంలో 95 మందిటికి ఆశ్రయం కల్పించి విద్యనభ్యసించేలా చర్యలు చేపడుతున్న చెప్పారు. ట్రస్టు నుంచి ఇకపై గిరిజన పేద, ఒంటరి మహిళలను ఆదుకొనేందుకు ఉచితంగా రెండో శుక్రవారం నిత్యావసర వస్తువులను అందించేలా ట్రస్టు అధ్యక్షులు చర్యలు చేపట్టారన్నారు. నిత్యావసర సరకుల పంపిణీ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, నాయకులు జి.సుబ్రమణ్యం, జె.ఆనందరాజు, ముకుందరావు, పుండరీకాక్షుడు, జి.సింహాచలం, ట్రస్టు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత ఇసుక పాలసీ మంచి నిర్ణయం'

పాయకరావుపేట, జూలై 7 : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమల్లోకి తీసుకుని రావడం మంచి నిర్ణయమని, దీని వలన రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకుని భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లభిస్తుందని పాయకరావుపేట, తుని తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు, భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర నాయకులు మజ్జూరి నారాయణరావు అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఇసుకదొరక్క, ఇళ్ల నిర్మాణాలు జరగక భవన నిర్మాణ కార్మికులతో పాటు కార్పెంటర్లు, ఎలక్ట్రికల్ పనులు చేసుకునేవారు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. కొత్తగా ఎన్నికైన కూటమి ప్రభుత్వం కార్మికుల సమస్యలు తెలుసుకుని ఉచిత ఇసుక పాలసీ విధానం అమలులోకి తెస్తుండడం అభినందనీయమన్నారు.

మంత్రి దృష్టికి 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలు

అనకాపల్లి టౌన్, జూలై 7 : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 1998 డీఎస్సీ ఉపాధ్యాయుల (ఎంటీఎస్) సంఘం ప్రతినిధులు హోం మంత్రి వంగలపూడి అనితకు వినతి పత్రాన్ని అందజేశారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటైన కార్యక్రమానికి విచ్చేసిన ఆమెను కలిసి సమస్యలను వివరించారు. గత ప్రభుత్వం 2023 ఏప్రిల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి, రాష్ట్రంలో 4072 మందిని ఎంటీఎస్ ఉపాధ్యాయులుగా, వయో పరిమితి 60 ఏళ్లుగా నిర్ణయించిందని పేర్కొన్నారు. వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచాలని, ఏజెన్సీ ప్రాంతం నుంచి మైదానానికి బదిలీ చేయాలని సంఘ ప్రతినిధులు విన్నవించారు.

'జగనన్న కాలనీల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి'

కొత్తూరు, జూలై 7: జగనన్న లే అవుట్‌లలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని అనకాపల్లి కూటమి నాయకులు జ్యోతుల గణేష్, మేడిశెట్టి సత్తిబాబు, కోన శ్రీనివాసరావు ఆరోపించారు. వైసీపీ పాలనలో పలు జగనన్న కాలనీల్లో అక్రమాలు జరిగాయన్నారు. ప్రధానంగా కొత్తూరు, సత్యనారాయణపురం, సంపతిపురం, పిసినికాడ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమాలకు హద్దే లేకుండా పోయిందన్నారు. వీటిపై పూర్తి వివరాలతో ప్రభుత్వానికి, ఎంపీ రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు ఫిర్యాదు చేస్తామన్నారు.

☛ సంక్షిప్తంగా..

జెన్‌కో స్పోర్ట్స్ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు

సీలేరు, జూలై 7: సీలేరు జెన్‌కో స్పోర్ట్స్ ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు (ఏడీఈ) నియమితులయ్యారు. గతంలో జెన్‌కో స్పోర్ట్స్ జనరల్ సెక్రటరీగా ఉన్న ఈఈ లక్ష్మీనారాయణ నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం థర్మల్ పవర్ ప్రాజెక్టు బదిలీ వెళ్లిపోయారు. ఈ మేరకు ఆదివారం స్థానిక జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ కేకేవీ ప్రశాంత్‌కుమార్ అధ్యక్షతన స్పోర్ట్స్ సభ్యులు సమావేశమై ఏడీఈ శ్రీనివాసరావును జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో అకౌంట్స్ ఆఫీసర్ ఈవీవీ సత్యనారాయణ, సబ్ ఇంజనీర్ శ్రీనివాస్, 1104 కార్మిక యూనియన్ రీజనల్ అధ్యక్షుడు వై.సత్తిబాబు, సభ్యులు జి.శివప్రసాద్, కె.లామా, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చింతపల్లి, జూలై 7: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు, 19న సీట్లు కేటాయింపు జరుగుతాయని చెప్పారు. చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ (ఎకనామిక్స్), బీఏ (హిస్టరీ), బిఎస్సీ (కంప్యూటర్ సైన్స్) బిఎస్సీ (కెమిస్ట్రీ), బీఎస్సీ (బోటనీ), బీఎస్సీ (జ్యాలజీ), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్) అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం 7569163403, 8500406280 నంబర్లకు కాల్ చేయాలని ఆమె కోరారు.

రూ.50 లక్షలతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు: ఎంపీపీ అనుషదేవి

చింతపల్లి, జూలై 7: మండలంలో రూ.50 లక్షల మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేశామని ఎంపీపీ కోరాబు అనుషదేవి తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యతో కలిసి ఆదివారం ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు, తాగునీటి పథకాల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు చేశామన్నారు. ఇప్పటికే గ్రామాల్లో తాగునీటి పథకాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. నిధులు విడుదల కాగానే డ్రైనేజీలు, సీసీ రోడ్లు, మంచినీటి పథకాల నిర్మాణాలు కూడా చేపడతామని ఆమె చెప్పారు. అలాగే మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులతో మండల వ్యాప్తంగా 18 చేతి పంపులు నిర్మిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో తమ్మంగుల సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య, గొందిపాకలు ఎంపీటీసీ సభ్యుడు తాంబెలి మోహన్‌రావు, వైసీపీ నాయకులు సింహాచలం, కృష్ణ, లోవరాజు పాల్గొన్నారు.

యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా ప్రసాద్‌పాల్

అరకులోయ, జూలై 7: యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అరకులోయ మండల అధ్యక్షుడిగా రెవరెండ్ వి.ప్రసాద్‌పాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఓ రిసార్ట్‌ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా వి.ప్రభుదాస్, కన్వీనర్‌గా కేఎస్.బాబూరావు, ఉపాధ్యక్షుడిగా పి.షద్రక్, ప్రధాన కార్యదర్శిగా సంజీవ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా ప్రదీప్, కోశాధికారిగా శామ్యూల్ ఎన్నికయ్యారు. అలాగే కార్యనిర్వాహక సభ్యులుగా పలు చర్చిల సంఘ సేవకులను ఎన్నుకున్నట్టు ప్రధాన కార్యదర్శి సంజీవ్‌కుమార్ తెలిపారు. నూతన కార్యవర్గాన్ని పలువురు పాస్టర్లు అభినందించారు.

17న సామూహిక వ్రతాలు

పాడేరు రూరల్, జూలై 7: మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో 108 మంది దంపతులతో ఈ నెల 17న సామూహిక వ్రతాలు నిర్వహిస్తామని బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆలయ ప్రాంగణంలో ప్రచార పోస్టర్‌లను ఆవిష్కరించారు. వ్రతంలో పాల్గొనదలచిన దంపతులు టీటీడీ కల్యాణ మండపంలోని బ్రహ్మకుమారీస్ ఆశ్రమంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దంపతులు పాల్గొని సత్యనారాయణస్వామి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కె.సింహాచలంనాయుడు, ఎస్.కొండలరావు, కోటిబాబునాయుడు, వెంకటరత్నం, ముకుందరావు, దేముడు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు స్ప్రేయింగ్



సీలేరు, జూలై 7: సీలేరులో పంచాయతీ పరిధిలోని వీధుల్లో ఆదివారం దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేశారు. ఇటీవల ఏజెన్సీలో వ్యాధుల కాలం ప్రారంభం కావడం.. వర్షాలు కురుస్తుండడంతో దోమలు పెరిగి జ్వరాలు, వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో దోమల నివారణ చర్యల్లో భాగంగా ఆదివారం మార్కెట్ రోడ్డులోని పలు వీధులు, ప్రధాన కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు.

పారిశుధ్య పరిరక్షణ అందరి బాధ్యత



ప్రధాన రోడ్డులో తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

కొయ్యూరు, జూలై 7: పారిశుధ్య పరిరక్షణ అందరి బాధ్యత అని వెలగలపాలెం సర్పంచ్ ఇరవాడ సత్తిబాబు చెప్పారు. ఆదివారం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామాల్లో ప్రధాన రహదారులకు ఇరువైపులా తుప్పలు తొలగించారు. అలాగే మురుగునీటి కాల్వలు పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆరోగ్యవంతమైన గ్రామాల కోసం అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని పంచాయతీకి సహకరించాలని ఆయన కోరారు. కాగా, భగత్‌సింగ్ యుజన సంఘం సభ్యులు స్వచ్ఛందంగా పారిశుధ్య పనులు నిర్వహించారు.